



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

జేఎన్‌టీయూ.. జాప్యం

- సీఎం రాకతో కళాశాల దశ తిరిగేనా?
- ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలో అన్నీ సమస్యలే
- వసతి లేక బోధన సాగక విద్యార్థుల అవస్థలు
- నిర్మాణాల నుంచి నియామకాల వరకూ నిర్లక్ష్యమే
- నేడు కళాశాలలో వనమహోత్సవానికి చంద్రబాబు, పవన్ రాక



జేఎన్‌టీయూ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ. ఇలాంటి సంస్థలో సీటు కోసం విద్యార్థులు పోటీ పడతారు. కానీ నరసరావుపేట సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ కాకినాడ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు విముఖత చూపుతున్నారు. ఎనిమిదేళ్లుగా కళాశాలలో భవన నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. అధ్యాపక నియామకాల్లోనూ జాప్యం చోటుచేసుకుంటుంది. మొత్తంమీద అటు వసతి.. ఇటు బోధన సక్రమంగా సాగక అడ్మిషన్లు పొందిన విద్యార్థులు అల్లాడుతున్నారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు జేఎన్‌టీయూ కేకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ కళాశాలను పట్టించుకోలేదు. ఇదే రీతిలో వర్సిటీ పాలకులు కూడా నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు. దీంతో ప్రస్తుతం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. గతంలో కళాశాల ఇక్కడ నెలకొల్పేందుకు కృషి చేసి శంకుస్థాపన చేసిన చంద్రబాబు తిరిగి శుక్రవారం ముఖ్యమంత్రి హోదాలో కళాశాలకు రానున్నారు. దీంతో కళాశాల భవితపై చంద్రబాబు దృష్టి సారిస్తారని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఖాళీల వివరాలు ఇలా..			
క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్నవారు	ఖాళీ
ప్రొఫెసర్	8	1	7
అసోసియేట్లు	18	2	16
అసిస్టెంట్లు	53	4	49

ప్రాంగణ ఎంపికలు ఇలా..	
సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021	180
2022	150
2023	110
2024	72

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సా...గుతున్న కళాశాల భవన నిర్మాణాలు. పూర్తికాని భవనాల్లో తరగతులు. 73 మంది అధ్యాపకుల కొరత.. ఇదీ నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల పరిస్థితి. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. నరసరావుపేటకు సమీపంలో జేఎన్‌టీయూ కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలను 2016లో ఏర్పాటు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కళాశాలకు శంకుస్థాపన చేశారు. కళాశాల భవనాల నిర్మాణానికి జేఎన్‌టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగ శాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. ఐదేళ్లుగా కళాశాల భవన నిర్మాణ పనులు సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా మాత్రమే పనులు పూర్తి చేశారు. రూ.62 కోట్లతో చేపట్టిన వసతి గృహాల నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తికి నోచుకోలేదు. కళాశాల భవనాలు, వసతి గృహాల నిర్మాణాలు పూర్తికాక పోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కళాశాలలో ఐదు బ్రాంచ్‌లు ఉండగా వెయ్యి మందికిపైగా విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఆ స్థాయిలో సౌకర్యాలు, వసతులు, బోధన జరగడంలేదు. పూర్తికాని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాంగణంలో వసతి గృహాలు లేక వసతికి విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అధ్యాపకుల కొరతతో బోధన సక్రమంగా జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళాశాల తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

అతిథి అధ్యాపకులే దిక్కు

ఇంజనీరంగ్ కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడంలేదన్న విమర్శలున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో వర్సిటీ ఘోరంగా విఫలమవుతోంది. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసి రూ.7.11 కోట్లు వార్షిక బడ్జెట్‌ను కేటాయించింది. అయితే వైసీపీ పాలకులు అధ్యాపకులను నియమించడాన్ని విస్మరించారు. పర్మినెంట్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నది ఒకే ఒక ప్రొఫెసర్ కాగా అది కూడా ప్రిన్సిపాలే. అసోసియేట్ ప్రొఫెసర్లు కేవలం ఇద్దరే ఉండగా ఒకరు క్రీడలకు కేటాయించారు. కనీసం అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించే విషయంలోనూ వర్సిటీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఉద్యోగాలను కోల్పోతున్న విద్యార్థులు

అధ్యాపకుల కొరత వెంటాడుతుండటంతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. అధ్యాపకులు లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు చేరేందుకు ఇష్టపడటంలేదు. దీంతో సీట్లు మిగిలిపోతున్నాయి. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఎంతగానే ఉపయోగపడాల్సిన కళాశాలను వర్సిటీ నిరుపయోగంగా మార్చేస్తోందన్న విమర్శలున్నాయి. ఏటా ఉద్యోగాలు పొందే విద్యార్థుల సంఖ్య పెరగాల్సి ఉండగా ఈ కళాశాలలో దారుణంగా పడిపోతుంది. అయినా అటు ప్రభుత్వం కానీ ఇటు వర్సిటీ పాలకవర్గం కానీ పట్టించు కోవడంలేదు.

చంద్రబాబుపైనే విద్యార్థుల ఆశలు

జేఎన్‌టీయూ కాకినాడ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థ. ఈ కళాశాల తమ ప్రాంతంలో ఉండాలని ప్రజల ఆశ. ఈ విద్యా సంస్థలో చదువుకోవాలనేది విద్యార్థుల కల. అలాంటి విద్యా సంస్థను ఉమ్మడి గుంటూరు జిల్లాకు తీసుకువచ్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుది. కాగా నరసరావుపేటలో ఏర్పాటు చేసేలా నాటి అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు చేశారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైసీపీ హయాంలో కళాశాల నిర్లక్ష్యానికి గురైంది. దీంతో ఎనిమిదేళ్లుగా కళాశాలలో నిర్మాణాల నుంచి అధ్యాపకుల నియామకాల వరకూ జాప్యమే. విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలోనూ నష్టపోతున్నారు. ఈ దశలో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జరిగే వనమహోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొనేందుకు రానున్నారు. వీరి పర్యటనతో అయినా కళాశాల దశ మారుతుందని విద్యార్థులు భావిస్తున్నారు. నిర్మాణాల్లో జాప్యాన్ని నివారించి అధ్యాపకులను నియమిస్తారని.. కనీస వసతులు కల్పిస్తారని సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించి ప్రకటన చేస్తారని విద్యార్థులు.. వారి తల్లి దండ్రులు ఎంతో ఆశతో ఉన్నారు. వీరి పర్యటనతో కళాశాల సమస్యలు పరిష్కారమైతే విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పవచ్చు.


నిర్మాణంలో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్


బాలికల వసతి గృహం


బాలుర వసతి గృహం

నేడు.. చంద్రబాబు, పవన్ రాక

- నరసరావుపేట జేఎన్‌టీయూలో వనమహోత్సవం
- మొక్కలు నాటనున్న సీఎం, డిప్యూటీ సీఎం.. భారీగా పోలీసు బందోబస్తు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, జేసీ సూరజ్, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


నరసరావుపేట (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా టీడీపీ, జనసేన అధినేతలైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌లు ఒకే వేదికపైకి రానున్నారు. నరసరావుపేట మండలం కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎంల హోదాలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు పాల్గొననున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వేర్వేరుగా రెండు హెలికాప్టర్లలో జేఎన్‌టీయూకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. చంద్రబాబు, పవన్ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో వారు ప్రసంగించనున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు సభకు హాజరుకానున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ సూరజ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పరిశీలించారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వారు అధికారులను ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు.

ఆర్భాటాలకు దూరంగా సభ

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హంగు, ఆర్భాటాలు లేకుండా సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఐదారు వేల లోపు స్థానిక ప్రజానీకం మధ్య వన మహోత్సవం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారన్నారు. భద్రత విషయంలో మాత్రం రాజీ లేదన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.


కార్యక్రమం ఇలా..

- ఉదయం 10.10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు బయలుదేరుతారు.
- 9.30 గంటలకు మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. జెఎన్‌టీయూ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.15గంటలకు పవన్, 10.30గంటలకు చంద్రబాబు జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు వస్తారు.
- 10.45 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఇద్దరూ కలిసి మొక్కలు నాటుతారు.
- అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- 12.45 గంలకు బహిరంగ సభ ముగుస్తుంది.
- 12.50గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని బయలుదేరి వెళ్తారు.


జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్

మళ్లీ సాగర్ గేట్లెత్తారు

- 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- దిగువుకు 3.07 లక్షల క్యూసెక్కులు విడుదల


26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

వీపీ సౌత్, మాచర్ల రూరల్/ నరసరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ సాగర్ బంధనాలను తెంచుకుంది. ఈ సీజన్‌లో రెండో సారి నాగార్జున సాగర్ గేట్లు మొత్తం ఎత్తి దిగువుకు నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్‌కు ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో సాగర్ జలాశయం క్రస్ట్ గేట్లన్నీ మళ్లీ తెరుచుకున్నాయ్. జలాశయం 26 గేట్లు ఎత్తి నీటిని గురువారం విడుదల చేశారు. ఈ నెలలో గేట్లన్నీ తెరుచుకోవడం ఇది రెండో సారి. క్రస్ట్ గేట్ల నుంచి పాల నురగలా జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను తనివితీరా చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. డ్యాంకు వస్తున్న నీటిని వస్తున్నట్టుగా దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో 26 క్రస్ట్ గేట్లలో 12 గేట్లను 5 అడుగులు, 14 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పూర్తి స్థాయి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 312.04 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కుడి కాల్వ ద్వారా 9387, ఎడమ కాల్వ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,745 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 3,07,382, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 మొత్తం ఔట్‌ఫ్లో 3,56,194 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,56,194 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు పోటెత్తుతున్న వరద

సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. భారీగా వరద వస్తుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి ప్రకాశం బ్యారేజ్‌కు 2,71,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతలకు 1,64,573 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రవాహం శుక్రవారానికి మూడులక్షల క్యూసెక్కులకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా 42.57 టీఎంసీల నిల్వ ఉంది.


ఎత్తిపోతలకు మోక్షమెప్పుడో?

- మూలనపడిన గణపవరం పథకం
- నాడు వరప్రదాయిని.. నేడు నిరుపయోగం
- అన్నదాతల ఎదురుచూపు.. అధికారుల నిర్లక్ష్యం

నాదెండ్ల, ఆగస్టు 29: మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో రూ.కోట్లతో నిర్మించిన గణపవరం ఎత్తిపోతల పథకం మూలన పడింది. ఒకనాడు గణపవరం గ్రామ ఆయకట్టు రైతులకు వరప్రదాయినిగా ఉన్న ఈ పథకం అధికారుల నిర్లక్ష్యం, కొందరి అనాలోచిత నిర్ణయాలతో నిరుపయోగంగా మారింది. సుమారు 1700 ఎకరాల ఆయకట్టు సాగు చేసేందుకు అప్పటి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ కృషితో రూ.8 కోట్లతో గణపవరం-2, 3 ఎత్తి పోతల పథకం మంజూరైంది. శ్రీ వరసిద్ధి వినాయక సంక్షేమ సంఘం పేరుతో ఎత్తిపోతల కమిటీ ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించారు. ఈ పథకంతో గణపవరంతో పాటు నాదెండ్ల గ్రామాలకు చెందిన రైతులకు ప్రయోజనం కలిగింది. అయితే 2018లో హిమవంతరావును తొలగించి వైసీపీకి చెందిన బొప్పుడి రామారావుకు ఎత్తిపోతల పథకం బాధ్యతలను అప్పగించారు. అప్పటి నుంచి ఆయన సీతారామాంజనేయస్వామి ఆయకట్టుదారుల సంక్షేమ సంఘం పేరుతో కమిటీ ఏర్పాటు చేసుకుని ఎత్తిపోతలను నిర్వహించారు. గత ఏడాది కూడా ఎత్తిపోతల పథకం ద్వారా కొన్నాళ్ళు రైతుల పొలాలకు నీరు అందించారు. అయితే ఇటీవల పథకం ప్రాంగణంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన కాపర్‌రాడ్లు, తీగలు, ఆయిల్‌ను దొంగలు చోరీ చేశారు. ప్రస్తుతం అక్కడ వాచ్‌మన్ కూడా లేడు. కొంత ప్రాంతంలో గ్రావిటీ పైపులైన్ దెబ్బతిన్నది. దీంతో ఈ పథకం పని చేయక మూలనపడింది. ఈ క్రమంలో మళ్లీ బాధ్యతలు తీసుకోవాలని రైతులతో పాటు టీడీపీ వర్గీయులు కోరగా గతంలో తనను అకారణంగా తొలగించారని హిమవంతరావు నిరాకరించారు. ఈ పథకం పనిచేయక మరోవైపు కుప్పగంజి వాగు గుండా సాగు నీరు వృథాగా పోవడంతో పాటు మెట్ట పైర్లు బెట్టకు వచ్చాయి. ఈ క్రమంలో పర్యవేక్షణ చేయాల్సిన ఐడీసీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో కళ్ల ముందే ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు చందాలతో మరమ్మతులు చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అద్దెకు ట్రాన్స్‌ఫార్మర్ తెప్పించుకుని ఎత్తి పోతలను నిర్వహించేందుకు రైతులు ముందుకు వచ్చారు. రైతుల కృషి ఎంత మేర ఫలిస్తుందో వేచి చూడాలి.



నిరుపయోగంగా పడి ఉన్న గణపవరం ఎత్తిపోతల పథకం


చోరీకి గురైన విద్యుత్ సామాగ్రి



ముంబై నటి కేసులో సమగ్ర విచారణ చేయాలి

పొన్నూరుటౌన్, ఆగస్టు 29: ముంబైకి చెందిన నటి కేసులో సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గురువారం డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సలహాదారుడి పదవి వెలగపెట్టిన సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డితో సహా ఐపీఎస్‌లు అందరూ కలిసి ఒక మహిళపై చేసిన సామూహిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారు అనే అంశాలపై నిజ నిర్ధారణ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని వీటిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని ప్రభుత్వాని కోరారు.

టీడీపీలో చేరనున్న వైసీపీ కౌన్సిలర్లు

తెనాలి అర్బన్, ఆగస్టు 29: వైసీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇద్దరు కౌన్సిలర్లు గురువారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గుంటూరులో ఆయన స్వగృహంలో కలిశారు. 25, 26 వార్డుల కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, షేక్ ఇస్మాయిల్ మాజీ మంత్రిని కలిసి పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. వారి బాటలోనే మరి కొందరు కౌన్సిలర్లు టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాదియాకు స్వర్ణ పతకం



స్వర్ణ పతకంతో సాదియా అల్‌మాస్

మంగళగిరి సిటీ, ఆగస్టు 29: మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్‌మాస్ అంతర్జాతీయ వేదికపై మరోమారు సత్తా చాటింది. మాల్టా దేశంలో ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు జరుగుతున్న ప్రపంచ జూనియర్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా 57 కిలోల విభాగంలో సాదియా ఓవరాల్‌గా స్వర్ణ పతకం సాధించింది. స్క్వాట్‌లో 190 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 97.5 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 175 కిలోలు కలిపి మొత్తం 462.5 కిలోల బరువును ఎత్తి ఈ ఘనతను సాధించినట్టు సాదియా తండ్రి, కోచ్ షేక్ సందాని తెలిపారు. అంతర్జాతీయ వేదికపై మంగళగిరి ఖ్యాతిని మరోమారు ఇనుమడింపజేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా మాల్టా దేశంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సహకారం అందించాలని సాదియా అల్‌మాస్ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించగా, తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్ ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట రూ.3 లక్షల సాయాన్ని అదే రోజు అందజేశారు.

చేనేత సమస్యలపై మంత్రి సవితకు వినతి




మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఆగస్టు 29: రాష్ట్రంలో చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు గురువారం తాడేపల్లిలో ఏపీ చేనేత, జౌళి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకువెళ్లి, నేతన్న సాధకబాధకాలపై చర్చించారు. అనంతరం మంగళగిరిలోని అమరావతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్ మాట్లాడారు. చేనేత సమస్యలపై మంత్రితో చర్చించామని, బోగస్ చేనేత సహకార సంఘాల ప్రక్షాళనకు పూర్తిగా సహకరిస్తామని తెలియజేశామని చెప్పారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, ఎన్నికల ద్వారా ఆప్కో చైర్మన్ ఎన్నికను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. చేనేత జీఎస్టీకి రీఎంబర్స్‌మెంట్ అనేది సాంకేతికంగా ఇబ్బందికరమైందని, చేనేత జీఎస్టీకి ప్రత్యేక హెచ్ఎస్ఎన్ కోడ్ ఇవ్వాలని, చేనేతపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలని, చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. ఆయా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారని తెలిపారు. వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, వాసా పల్లపురాజు, కూరపాటి కోటేశ్వరరావు, పడవల మోహన త్రినాథ్, పిచ్చుక ఫణికుమార్, రామనాథం పరమేశ్వరరావు, గుర్రం చినవీరయ్య, తాళ్ల మోహనకృష్ణ పాల్గొన్నారు.

బదిలీల్లో జోక్యం ఉన్నట్లు నిరూపిస్తే రాజీనామా

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు 29: ఉద్యోగుల, అధికారుల బదిలీల్లో తన కుటుంబ సభ్యుల జోక్యం ఉన్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి, పార్టీకి కూడా రాజీనామా చేస్తానని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం తన స్వగృహంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన వలన పార్టీకి నష్టం జరగడానికి వీల్లేదనీ, ఎమ్మెల్యే పదవిపై కూడా మచ్చ పడటానికి వీల్లేదనీ, ఈ విషయంలో తాను చాలా స్పష్టంగా ఉన్నానని చెప్పారు. తన భార్య జన్మదిన వేడుకల్లో పోలీసులు పాల్గొనడం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన అని చెప్పారు. ఆరోజు చిలకలూరిపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై సమీక్షించడానికి పోలీసులను పిలిచామని తెలిపారు. సీఐలు, ఎస్సైలు వచ్చినప్పుడు మండల పార్టీ నాయకులు కేక్ తీసుకొచ్చారని, ఆ సమయంలో పోలీసులు అక్కడ నిలబడటం యాదృచ్ఛికం తప్ప వారు కావాలని రాలేదని పేర్కొన్నారు. దానిని కూడా తాను సమర్థించడం లేదన్నారు. బదిలీల్లో జోక్యం చేసుకుంటున్నారని, అక్రమ వ్యాపారాలకు కొమ్ము కాస్తున్నారని వచ్చిన ఆరోపణలు బాధను కలిగించాయన్నారు. తన కుటుంబ సభ్యులు కొద్ది నెలలుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నారని తెలిపారు. అక్కడ ఉంటున్నవారిపై ఇలా బురద చల్లడం సరికాదని అన్నారు. ఒక వివాహ వేడుకకు హాజరయ్యే నిమిత్తం తన భార్య హైదరాబాదు నుంచి చిలకలూరిపేటకు వచ్చినట్లు తెలిపారు. ఆ మరుసటి రోజే పుట్టినరోజు వచ్చిందని, పుట్టిన రోజు వేడుకలు చేసుకోవడానికి తమ కుటుంబ సభ్యులు ఎప్పుడూ ఇష్టపడరని అన్నారు.

మున్సిపల్ చైర్మన్ రఫాని టీడీపీలో చేరిక

చిలకలూరిపేట, ఆగస్టు 29: వైసీపీకి చెందిన చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని గురువారం టీడీపీలో చేరారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు టీడీపీ కండువా కప్పి ప్రత్తిపాటి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని పుల్లారావు ఇచ్చిన పిలుపుమేరకు తాను టీడీపీలో చేరినట్లు రఫాని ప్రకటించారు. వైసీపీ రాజకీయాలు నచ్చటం లేదని, ఓటమి నుంచి ఆ పార్టీ నాయకులు గుణపాఠం నేర్చుకోలేదని చెప్పారు. తప్పుడు ప్రచారాలతో రాజకీయం చేయటమే వారి ఎజెండాగా ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు షేక్ కరీముల్లా, టీడీపీ కౌన్సిలర్ గ్రూపు నాయకుడు గంగా శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రఫానికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రత్తిపాటి

డాక్టర్ కందిమళ్లకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

చిలకలూరిపేట, ఆగస్టు 29: తెలుగు భాషా వికాసానికి నాటక ప్రక్రియ ద్వారా విశేష కృషి చేస్తున్న పట్టణానికి చెందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు తెలుగు భాషా పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ గురువారం ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షత వహించారు. ప్రముఖ నాటక రచయితగా, పరిశోధకునిగా గుర్తింపు పొందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు స్థానిక డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా, రీడర్ గా, ప్రొఫెసర్‌గా 39 ఏళ్లు పని చేశారు. కందిమళ్ల 17 నాటకాలు, నాటికలను రచించగా అవి పరిషత్తులలో వందలాది బహుమతులు పొందాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి తెలుగు నాటకరంగం నూతన ధోరణులు, ప్రయోగాలు అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారు. బరంపురం విశ్వవిద్యాలయం నుంచి గుంటూరు జిల్లా నాటకరంగ చరిత్రపై పరిశోధన చేసి డీలిట్ పట్టాను పొందారు. భారతీయ నాటక రంగ చరిత్రలో ఈ పట్టాను పొందిన పరిశోధకుడు కందిమళ్ల ఒక్కరే. ప్రకాశం జిల్లా రైతు మాండలికంలో కందిమళ్ల రచించిన సైసై జోడెడ్లబండి నాటకం బంగారు నంది పురస్కారాన్ని పొందింది. తెలుగు నాటక రంగంపై 10 గ్రంథాలను రచించగా రెండు గ్రంథాలకు ఉత్తమ నాటక గ్రంథాలుగా నంది అవార్డులు లభించాయి. తెలుగు భాషా బోధన తో పాటు నాటక రచన పరిశోధన తో భాషా వికాసానికి కందిమళ్ల విశేష కృషి చేస్తున్నారు.

సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న పురందేశ్వరి, పక్కన బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29: సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం లాలుపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కిసాన్ మోర్చా ఇన్చార్జి, జాతీయ కార్యవర్గ సభ్యుడు భారతీ మోహన్, కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.సురేష్‌రెడ్డితోపాటు ఆమె హాజరైయ్యారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ బీజేపీకి సానుకూల దృక్పథంతో ఉన్నారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అత్యధిక సంఖ్యలో ప్రజల నుంచి సభ్యత్వాలు చేర్పించాలన్నారు. వివిధ మోర్చాలు ప్రత్యేకించి కిసాన్ మోర్చా ద్వారా రైతులను పెద్ద ఎత్తున చేర్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాదు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సురేంద్రనాథ్ రెడ్డి, పాకాలపాటి రవిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భార్యను హత మార్చిన భర్త అరెస్ట్

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 29: భార్యను క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హతమార్చిన భర్తను అరెస్ట్ చేసినట్లు ఇన్చార్జి ఈస్ట్ జోన్ డీఎస్పీ టీవీ సుబ్బారావు గురువారం తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన అచ్చి అంకమ్మరావు అలియాస్ అభిరామ్ 11 ఏళ్ల క్రితం గుంటూరు వచ్చి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గుంటూరు టౌన్ మణిపురం ప్రాంతానికి చెందిన మాచవరపు చిన్న వెంకటేశ్వర్లు రెండో కుమార్తె మౌనికను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి వైవాహి జీవితంలో ఇద్దరు పిల్లలు పుట్టారు. అంకమ్మరావు సెంట్రింగ్ పని చేస్తుండగా, అతని భార్య మౌనిక ఆటోనగర్‌లోని కంపెనీలో పని చేస్తుంది. వ్యసనాలకు బానిసైన అంకమ్మరావు భార్యపై అనుమానంతో ఆమె ఎక్కడ పని చేస్తే అక్కడికి వెళ్లి మగవాళ్లతో అక్రమ సంబంధం అంటగట్టి ఆమెను కొట్టి, తిట్టి, కులం పేరుతో దూషిస్తున్నాడు. ఈ క్రమంలో 26వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. ఫ్రైడ్ రైస్ తెచ్చి ఆమెను తినమని బలవంతం చేసినా, ఆమె తినలేదు. దీంతో బూతులు తిట్టి ఆమెను గొంతు పట్టుకొని గోడకేసి కొట్టాడు. పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్ తీసుకుని తలపై కొట్టాడు. అనంతరం పారిపోయాడు. మౌనికను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. నిందితుడైన మృతురాలి భర్త అంకమ్మరావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు డీఎస్పీ సుబ్బారావు చెప్పారు. పాతగుంటూరు సీఐ వై.వి. సోమయ్య, ఎస్ఐ భాగ్యరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, ఆగస్టు 29: జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడి కక్కడే మరణించగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన కోండ్రుపాడు జాతీయ రహదారిపై హైవే అథారిటీకి చెందిన ట్రాక్టర్ మార్జిన్‌లో పార్క్ చేసి ఉంది. గుంటూరు శ్రీనివాసరావుపేటకు చెందిన కుంచాల అంకమ్మరావుతో పాటు మరో ముగ్గురు కారులో చిలకలూరిపేటలో ఒక ఫంక్షన్‌కు వెళ్తున్నారు. అయితే అతి వేగంగా కారు నడుపుతూ ఆగివున్న ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొట్టాడు. ముందు వైపు డ్రైవర్ పక్కనే కూర్చున్న కుంచాల అంకమ్మరావు (35) కారులోనే అక్కడి కక్కడే మరణించాడు. కారు నడుపుతున్న చల్లా శ్రీనివాసరావుతో పాటు లాలం చిరంజీవి, మల్లెల మూర్తికి తీవ్ర గాయాలైయ్యాయి. వీరిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

421 మద్యం సీసాలు స్వాధీనం



పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ మద్యం సీసాలు

మాచవరం, ఆగస్టు 29: తెలంగాణ రాష్ట్రం నుంచి కృష్ణానదిపై నాటు పడవల ద్వారా అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను పట్టుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకొని, ఒక కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మాచవరం ఎస్ఐ కె.సతీష్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు గోవిందాపురం కృష్ణానది సమీపంలో దాడులు చేయగా తెలంగాణ రాష్ట్రం నుంచి నాటు పడవల ద్వారా కృష్ణానది దాటించి వేర్వేరు ప్రాంతాలకు మద్యం సీసాలను తరలించే పనిలో నిమగ్నమైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన బడుగుల నాగరాజు, తొడేటి నరేష్, మాచవరం మండలం శ్రీరుక్మిణీపురం గ్రామానికి చెందిన బత్తుల సత్యనారాయణ, మాచవరంకు చెందిన మహంకాళి వెంకటరావు, మోర్జంపాడు గ్రామానికి చెందిన శ్రీను అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 421 మద్యం సీసాలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మంగళగిరి సిటీ, ఆగస్టు 29: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది. రైల్వే సీఐ అంజిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మంగళగిరి రైల్వే స్టేషన్ దాటిన తరువాత కొద్ది దూరంలో విగతజీవుడై పడి ఉన్నాడు. రన్నింగ్ ట్రైన్ నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు బ్రౌన్ కలర్ టీషర్టు ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627546 నంబరులో సంప్రదించాలని కోరారు.

షెడ్యూల్ కంటే ముందే పరీక్షపై ఫిర్యాదు



ఆచార్య గంగాధరరావుకు ఫిర్యాదు చేస్తున్న ఎన్‌డీఎస్‌ఎఫ్ నాయకులు

పెదకాకాని, ఆగస్టు 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్న డిపార్ట్మెంట్ కో ఆర్డినేటర్ బి.శేఖర్‌బాబును ఎన్‌డీఎస్‌ఎఫ్ నాయకులు గురువారం యూనివర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఎగ్జామ్‌ను షెడ్యూల్ ప్రకారం 29న మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరపాల్సి ఉండగా, ఎటువంటి కారణం లేకుండా, పైఅధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్దేశించిన షెడ్యూల్ కంటే ముందు ఉదయం 10 గంటలకే నిర్వహిస్తున్నారు. సంగతి తెలియడంతో ఎన్‌డీఎస్‌ఎఫ్ నాయకులు వెళ్లి డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్‌ను వివరణ అడుగగా, సరిగా సమాధానం చెప్పకపోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో నాయకులు విషయాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయమని సూచించడంతో విద్యార్థి నాయకులు విషయాన్ని ఇన్చార్జి వైస్ ఛాన్సలర్, రెక్టర్, రిజిస్ట్రార్‌ల వద్దకు తీసుకెళ్లారు. అధికారులు సానుకూలంగా స్పందించి ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, ఈ విషయంతో పాటు వాటి మీద కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థి ఆందోళనను విరమించారు. ఎన్‌డీఎస్‌ఎఫ్ ప్రెసిడెంట్ రత్న సాగర్, సెక్రటరీ గణేష్, వైస్ ప్రెసిడెంట్ రత్న కిషోర్, ట్రెజరర్ మధు పాల్గొన్నారు.

బోగస్ రుణాలపై చర్యలు ప్రారంభం

- సీఎంఎం మేరీ జ్యోత్స్న సస్పెన్షన్
- ఇద్దరు సీవోలు, ఒక ఆర్పీ కూడా సస్పెన్షన్

పొన్నూరుటౌన్, ఆగస్టు 29: బోగస్ గ్రూపులు, అక్రమ రుణాల పేరుతో పొన్నూరు పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో జరిగిన అవకతవకలపై మెప్మా మిషన్ డైరెక్టర్ స్పందిస్తూ ముగ్గురు అధికారులు, ఒక రిసోర్స్ పర్సన్‌ను సస్పెన్షన్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నూరు పురపాలక సంఘంలోని కమ్యూనిటీ మిషన్ మేనేజర్ ఎం.మేరీ జ్యోత్స్న, కమ్యూనిటీ ఆర్గనైజర్లు వి.ఉషారాణి, పి.జ్యోతి, రిసోర్స్ పర్సన్ నాగ సంధ్యలను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మెప్మా విభాగంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై పీడీ వెంకటేశ్వరరావు విచారణకు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాలు రుణాలు పొందిన బ్యాంక్ నుంచి మరొక బ్యాంక్‌కు మారే వెసులుబాటుకల్పించారు. దీనిని పొన్నూరు పురపాలక సంఘంలోని మెప్మా అధికారులు వైసీపీ నాయకులతో కలిసి బోగస్ గ్రూపుల సృష్టికి అవకాశంగా మలుచుకున్నారు. బ్యాంకుల మధ్య సమన్వయం లేకపోవటంతో ఒక బ్యాంక్‌లో ఉన్న గ్రూపుతోనే మరొక బ్యాంక్‌లో కొత్త గ్రూప్ ఏర్పాటు చేసి బోగస్ రుణాలను పొందారు. ప్రాథమికంగా అందిన ఫిర్యాదుల మేరకు చైతన్య గోదావరి బ్యాంక్‌లోని వైఎస్ మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మదర్‌థెరిస్సా మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, చైతన్య గోదావరి బ్యాంక్‌లో శాంతి మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, దుర్గమ్మ మహిళా పొదుపు సంఘం రూ.7.50 లక్షలు, కెనరా బ్యాంక్‌లో తారా మహిళా పొదుపు సంఘం రూ. 8 లక్షలు రుణాలు పొందారు. ఈ గ్రూపులకు సంబంధించి సభ్యుల వివరాలు, ఆధార్ సీడింగ్‌ను మెప్మా పోర్టల్‌లో నమోదు చేయలేదు. అలాగే ఈ పొదుపు సంఘంలోని మహిళలు మరొక పొదుపు సంఘంలో కూడా సభ్యులుగా ఉండి వేరే బ్యాంక్‌లో రుణాలు పొందిఉన్నారు. సీఎంఎం కానీ, సీవోలు కానీ పొదుపు సంఘం బ్యాంక్ లింకేజ్ ఇచ్చినప్పుడు గ్రూపు వివరాలను, సంఘ కార్యకలాపాలను పుస్తక తీర్మానాలను పరిశీలించాలి. కానీ అధికారులు వీటిని పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఈ ఐదు గ్రూపుల ద్వారా రూ. 45.50 లక్షలు ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు అధికారుల విచారణలో గుర్తించారు. ప్రాథమిక విచారణలో అవకతవకలు రుజువైనట్లు గుర్తించటంతో వారిని వారి విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ఆర్పీ నాగసంధ్య పేరును మెప్మా లాగిన్ నుంచి తొలగించాలని ఆదేశించారు. అయితే పొన్నూరు పురపాలక సంఘంలో పెద్ద సంఖ్యలో బోగస్ గ్రూపులు ఏర్పాటు చేసి అవినీతికి పాల్పడినట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. సమగ్ర విచారణ జరిపితే మరిన్ని అవకతవకలు బహిర్గతం అవుతాయని పొదుపు మహిళలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కార్యదర్శుల కౌన్సెలింగ్ పూర్తి

గుంటూరు సిటీ, ఆగస్టు 29: పంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శులకు గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, జడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు మూడు జిల్లాల నుంచి తరలివచ్చిన కార్యదర్శులకు కౌన్సెలింగ్ చేపట్టారు. గ్రేడ్ 5, 6లకు చెందిన 376 మంది కార్యదర్శులకు స్థాన చలనం అయినట్లు తెలిసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

55,261 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 56,735 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 55,261 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 22,347 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	17000	334	8000	15500
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	10000	14000
273	9000	13000	273	11900	12000
341	8000	16000	341	9000	16000
4884	9000	11600	4884	12000	16500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500	తేజ	7500	18500
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	13500
దేవనూరు డీలక్స్	9500	14700	దేవనూరు డీలక్స్	9500	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల | గురజాల | సత్తెనపల్లి | పెదకూరపాడు

మాచర్ల కోర్టు న్యాయాధికారిగా ప్రశాంత్



న్యాయాధికారి ప్రశాంత్

మాచర్లటౌన్, ఆగస్టు 29: పట్టణంలోని క్రిమినల్ కోర్టు న్యాయాధికారిగా పి ప్రశాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు చేపట్టిన నియామకాల్లో భాగంగా తిరుపతికి చెందిన ప్రశాంత్ ఇక్కడకు వచ్చారు. ఈయన గతంలో తిరపతి, హైదరాబాద్‌లో న్యాయవాదిగా పనిచేశారు. కాగా ప్రశాంత్‌కు న్యాయాధికారిగా ఇది ప్రథమ పోస్టింగ్. ఇప్పటి వరకు క్రిమినల్ కోర్టు న్యాయాధికారిగా ఉన్న శ్రీనివాస్ కల్యాణ్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

ఆక్రమణలు తొలగించాలి

రెంటచింతల,ఆగస్టు 29 : ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఆక్రమణలతో పాటు, తహసీల్దార్ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకువున్న ఆక్రమణలు వెంటనే తొలగించాలని, లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు చేపడతామని తహసీల్దార్ జీ.కరుణకుమార్ హెచ్చరించారు. గురువారం డీటీ బ్రహ్మయ్య నేతృత్వంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వేయర్లు రోవర్ ద్వారా కొలతలు తీసి హద్దులను నిర్ధారించారు. సర్వేలో ఆర్ఐ కాంతారావు, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, సర్వేయర్ పాల్గొన్నారు.

మాచర్ల ఉప ఎంపీపీ టీడీపీలో చేరిక

మాచర్లటౌన్, ఆగస్టు 29: మాచర్ల మండల ఉప ఎంపీపీ మరిమళ్ల మనీషా తన భర్త ఏసోబుతో కలిసి టీడీపీలో చేరారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నివాసంలో వారు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వీరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

రెంటచింతల,ఆగస్టు 29: నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనే తన ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మంచికల్లు గ్రామంలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. పదవీ బాధ్యతలు చేపట్టిన 100 రోజుల్లోనే నియోజకవర్గంలో మెగా జాబ్‌మేళా నిర్వహించి 450 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్, టీడీపీ నేతలు రావెళ్ల చెంచయ్య, గోగుల వెంకట్రామిరెడ్డి, శీలం నేని సోదరులు, మట్టయ్య, అబ్బిరెడ్డి, బీ.రామకృష్ణ, ప్రభురాజ్‌యాదవ్, చేరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

రెంటచింతల,ఆగస్టు 29 : రెంటచింతలలోని బాల వికాస్ స్కూలు సమీపంలో శింగారెడ్డి ప్రతాపరెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. ప్రతాపరెడ్డి దంపతులు రాజుపాలెం వద్ద మిర్చి నర్సరీని నిర్వహిస్తున్నారు. వారం రోజుల నుంచి అక్కడే వుంటున్నారు. గురువారం ఇంటికి రాగా గేటు తాళాలు తీసి ఉండటం, ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. బీరువాలోని ఓ బంగారు గొలుసు, ఏడు పట్టు చీరలు, ఇంకా ఉపయోగించని నూతన ఎల్‌ఈడీ టీవీని అగంతకలు ఎత్తుకెళ్లినటుల గుర్తించాడు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.70 వేల వరకు వుంటుందని తెలిపాడు.

భూసార పరీక్షల ఆధారంగా సాగు చేపట్టాలి

● సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త వెంకట రాములు

క్రోసూరు, ఆగస్టు29 : భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటల సాగు చేపట్టాలని డాట్ సెంటర్ సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త వెంకట రాములు సూచించారు. గురువారం మండలంలోని ఆవులవారిపాలెంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యసంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల మోతాదులను నిర్ణయించుకొని జీవన ఎరువులు ఉపయోగిస్తే తెగుళ్ళను నివారించవచ్చన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వీ.హనుమంతరావు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పీ.ప్రవీణ్‌లు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పత్తిపంట క్షేత్ర సందర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ తిరుమల శ్రీను, రైతు సేవా కేంద్రం సిబ్బంది హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

దాచేపల్లి, ఆగస్టు 29: గుంటూరుజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పల్నాడుజిల్లా దాచేపల్లి నగరపంచాయతీలోని దుర్గా పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సి పాల్ బాచిమంచి మల్లికార్జునశాస్త్రి పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం అభినందనలు తెలియ జేశారు.

ఆర్థిక చేయూతనిస్తున్న సీజీజీబీ

● చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డి

నకరికల్లు, ఆగస్టు 29 : అన్ని రంగాలకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆర్థిక చేయూత నిస్తున్నదని ఆ బ్యాంకు చైర్మన్ కే.ప్రమోద్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుశాఖను ప్రారంభించారు. అనంతరం నకరికల్లులోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును అధునాతనంగా తీర్చిదిద్దిన నూతన భవనంలోకి చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

● అక్రమ వసూళ్ల దందా పిన్నెల్లి సోదరులదే..
● భూ కబ్జాలతో కోట్ల రూపాయలు దండుకున్నారు
● అక్రమ వ్యవహారాలు మా వంశంలోనే లేవు
● ఆర్యవైశ్యులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటా
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 29: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేశ్ ఆశీస్సులతో మాచర్ల నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అభ్యున్నతికి పాటుపడతానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఇటీవల నూతనంగా మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా పోలూరి నరసింహారావు ఎన్నిక కావడంతో గురువారం ఆర్యవైశ్య సంఘ నేతలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోదండ రామాలయంలో ఆర్యవైశ్య నేతలు నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో భూకబ్జాలు, దోపిడీలు, హత్యలు, అక్రమ కేసులు వంటి నవదందాలు పెట్రేగిపోయాయన్నారు. నవరత్నాలేమో గానీ వైసీపీలో శృంగార రత్నాలు పెరిగిపోయారన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరించి వ్యవస్థను నాశనం చేశారన్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను అవినీతిలో భాగస్వాములు చేశారన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కు పోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర పునర్నిర్మాణానికి అనితర కృషి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు మాదిరి ఉంగరాలు, అక్రమ వసూళ్లు తమ వంశంలోనే లేదన్నారు. మా తల్లిదండ్రుల హయాం నుంచి మా చేతి డబ్బు పెట్టిన వారిమేగానీ ఒకరి వద్ద నుంచి ఆశించినది లేదన్నారు. వైసీపీ నేతలు ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి మాన్యం భూములు కబ్జా చేశారని, టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్ నుంచి రోజూ తనకు వైసీపీ నేతల భూకబ్జాలపై ఫోన్లు వస్తున్నాయన్నారు. ఖరీదైన భూములు చూసి 22ఏ జాబితాలో చేర్చి సెటిల్‌మెంట్లతో కోట్ల రూపాయలు దండుకున్నారన్నారు. ముంబాయిలోని ఓ హీరోయిన్‌పై లైంగిక వేధింపులు చేశారన్నారు. తప్పుడు కేసు పెట్టి ముంబాయి నుంచి ఇక్కడకు తీసుకొచ్చి వేధించారన్నారు. వైసీపీ నేతలు మొత్తం సమాజాన్నే కలుషితం చేశారన్నారు.

బుగ్గవాగు నుంచి మాచర్ల పట్టణానికి మంచినీటిని అందిస్తామని హామీని గత పాలకులు గాలికి వదిలేశారన్నారు. మున్సిపాలిటీలో ఫిల్టర్‌బెడ్‌లు మరమ్మతులకు గురైతే ఐదేళ్లుగా మరమ్మతులు చేయించ లేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు చేయించి మంచినీటిని అందించామన్నారు. పట్టణ, మండలాల పరిధిలో వైసీపీ నేతలు పనులు చేయకుండా కోట్లాది రూపాయలు బిల్లులు చేయించుకున్నారన్నారు.

ఆర్యవైశ్యులు భయాందోళనలు చెందవద్దని, మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దోపిడీని వ్యతిరేకించడంలో వెనకాడవద్దన్నారు. సమాజానికి అవసరమైనప్పుడు మీ బాధ్యత తీసుకోవాలన్నారు. పార్టీలోని ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించి న్యాయం చేస్తానని, ఎవరూ అధైర్య పడవద్దని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ పోలూరి నరసింహారావు, కొత్తమాసు శ్రీరామమూర్తి, మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, మారం ప్రసాద్, కజ్జం సైదయ్య, కంభంపాటి అనిల్, చంటి, మదార్‌సాహెబ్, నక్షత్రపు ప్రసాద్, శేషు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నేతలు



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

నందిగామ హైస్కూల్‌కు

స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ స్పోర్ట్స్ అవార్డు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 29 : మండలంలోని నందిగామ జడ్పీ హైస్కూల్ 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ స్పోర్ట్స్' అవార్డుకు ఎంపికైంది. 2023- 24 విద్యాసంవత్సరంలో క్రీడల్లో పాఠశాల విద్యార్థులు చూపిన ప్రతిభ, సాధించిన విజయాల ఆధారంగా ఈ అవార్డుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబు చేతులమీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ లాకు పిచ్చయ్యలు అందుకున్నారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో వినాయకం, డీఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణబాబు చేతుల మీదుగా గురువారం సత్తెనపల్లి సుగాలి కాలనీ హైస్కూల్ ఉపాధ్యాయులు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో రియాజ్, సుధారాణి, నరసింహారావు తదితరులు ఉన్నారు.

మైనర్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

ముప్పాళ్ళ, ఆగస్టు 29: 18 సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం రాంబాబు హెచ్చరించారు.గురువారం ముప్పాళ్ళ హైస్కూల్లో ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మైనర్లు అవగాహనలేకుండా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై చనిపోతూ కుటుంబసభ్యులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే వారి తల్లిదండ్రులపైనా చట్టపరమైనచర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ర్యాగింగ్, మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం నాగేంద్రమ్మ, ఎస్ఐ హజరత్తయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి కలిగివుంటే కఠిన చర్యలు

● సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం రాంబాబు
● సమస్యాత్మక గ్రామం కొత్త బోధనంలో కార్డన్ సెర్చ్

రాజుపాలెం,ఆగస్టు29: గంజాయి కొన్న, విక్రయించిన కఠినచర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు హెచ్చరించారు. పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం మండలంలోని సమస్యాత్మక గ్రామమైన కొత్తబోధనంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై, నేర చరితులపై, అల్లరిమూకల కదలికలపై నిఘా ఉంచామన్నారు. అదే విధంగా గంజాయి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి, నాటు సారాయికి సంబంధించిన సమాచారమేమైనా ఉంటే 100, 9440796222 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. తొలుత గ్రామంలోని అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు వేణుగోపాల్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్‌గా

బాధ్యతలు స్వీకరించిన అప్పారావు

దాచేపల్లి, ఆగస్టు 29: దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్‌గా అప్పారావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేసిన అప్పారావు సాధారణ బదిలీలలో భాగంగా దాచపల్లి కమిషనర్‌గా వచ్చారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన నారాయణరావు విజయవాడ నగర కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.

టీఏ బిల్లులు చెల్లించాలి

మాచర్లటౌన్, ఆగస్టు 29: ఉపాధ్యాయుల టీఏ బిల్లులను త్వరితగతిన చెల్లించాలని కోరుతూ గురువారం ఏపీటీఎఫ్ నేతలు ఎంఈవో అల్లి సురేష్‌కు వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలోని 80 మంది ఉపాధ్యాయులకు మాచర్ల పట్టణంలో గత నెల 18 నుంచి 27 వ తేదీ వరకు టీచ్ టూల్‌పై నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇచ్చారని, ఇందుకు సంబంధించి టీఏ బిల్లులు చెల్లించాలని వారు ఎంఈవోని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కే.కృష్ణారావు, కార్యదర్శి రవికుమార్, కౌన్సిలర్లు కృష్ణాంజినాయక్, కోర్లయ్య, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపే పింఛన్లు పంపిణీ

దాచేపల్లి, ఆగస్టు 29: ప్రభుత్వం అందించే పింఛన్లను ఈనెల 31న శనివారమే పంపిణీ చేయనున్నట్లు దాచేపల్లి ఎంపీడీవో శోభారాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పింఛన్లను సెప్టెంబరు 2న సోమవారం పంపిణీ చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

నకరికల్లు: ఈనెల 31 శనివారం పింఛన్‌ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 1వ తేదీ ఆదివారం కావటంతో 31నే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలపారు. 31న పింఛన్లను తీసుకోగా మిగిలినపోయిన వారికి సెప్టెంబరు 2న అందజేస్తామని తెలిపారు. బదిలీ దరఖాస్తులు పెట్టుకున్న పింఛన్‌లను ఆయా గ్రామాల్లో ఈనెల లోనే తీసుకొనే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని, పింఛన్‌దారులు ఈ విషయాన్ని గమనించి బదిలీ అయిన గ్రామంలో పింఛన్ పొంద వచ్చని సూచించారు.

ద్విచక్ర వాహనం దహనం

రెంటచింతల,ఆగస్టు 29 : స్థానిక ఏవో కార్యాలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి దహనంచేసిన ఘటన గురువారం జరిగింది. రెండు రోజులుగా ఆ ద్విచక్ర వాహనాన్ని అక్కడే ఉందని, టీఎస్ రిజిస్ట్రేషన్ అని నెంబర్ ప్లేట్ మీద ఉందని స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

15లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

● మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటనరసయ్య

రాజుపాలెం,ఆగస్టు29 : రైతులు వారు పండించే పంట వివరాలను సెప్టెంబరు 15లోపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటనరసయ్య కోరారు. గురువారం మండలంలోని మొక్కపాడు గ్రామంలో మొక్కజొన్నపంటను ఆయన పరిశీలించారు. పంటలో కత్తెర పురుగు ఎక్కువగా ఉందని, ఇది మొవ్వ ద్వారా కాండంలోకి ప్రవేశించి కాండన్ని తొలిచి ఆకులను తినివేస్తుందని, ఇందుకుగాను తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అదే విధంగా కోటనెమలిపురి గ్రామంలో వరి పొలంబడి, పంట కోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహించారు.



మంత్రి రవీంద్రను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని, లైమ్, పల్వరైజింగ్ అసోసియేషన్ నేతలు

మైనింగ్ రాయల్టీని తగ్గించాలి

● మంత్రి రవీంద్రను కోరిన పిడుగురాళ్ల పట్టణ పల్వరైజింగ్, లైమ్ అసోసియేషన్ నేతలు

పిడుగురాళ్ల, ఆగస్టు 29: కరోనా సమయంలో వైసీపీ ప్రభుత్వం పెంచిన రూ.90ల మైనింగ్ రాయల్టీని తగ్గించాలని రాష్ట్ర గనులు, భూగర్భశాఖ, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను గురువారం పిడుగురాళ్ల పట్టణ పల్వరైజింగ్, లైమ్ అసోసియేషన్ నేతలు కోరారు. గురువారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలసి వారు ఇబ్రహీంపట్నంలోని మైన్స్ డైరెక్టరేట్ కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి పలు సమస్యలను వివరించారు. వైసీపీ హయాంలో హోల్డ్ చేసిన పాత రాయల్టీని రిలీజ్ చేయాలని, 1.6గా రాయల్టీని 1.1గా చేయాలని, లారీలకు జీపీఎస్ లేకుండా చేయాలని, మైనింగ్ లీజులు వెంటనే ఇచ్చేలా అన్నిరకాల అనుమతుల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించేలా చూ డాలని ఎమ్మెల్యే యరపతినేని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రితో పాటు భూగర్భ గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు అసోసియేషన్ నేతలు కలిసి వినతిపత్రం అందించారు.

మాచర్లకు వచ్చివెళ్లిన మాజీ ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్లటౌన్, ఆగస్టు 29: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం మాచర్లకు వచ్చి వెళ్లారు. ఇటీవల పీఆర్కేకు బెయిల్ మంజూరు కావడంతో నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చారు. కండీషన్ బెయిల్ కావడంతో ప్రతి గురువారం నరసరావుపేట ఎస్పీ కార్యాలయంలో సంతకం చేయాల్సి ఉండగా గురువారం సంతకం చేసి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలోని మాచర్లలోని తన స్వగృహానికి చేరుకున్నారు. గన్‌మెన్ లేకుండా తన వ్యక్తిగత అనుచరులతో గోప్యంగా మాచర్లకు వచ్చి, తన తల్లిదండ్రులు వెంకటేశ్వరరెడ్డి, రాములమ్మలను కలిసి హైదరాబాద్ వెళ్లారు.

అందుబాటులో 'హృదయ రక్ష'

● గుండెపోటుకు గురైన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంజక్షన్
● ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు వెల్లడి

సత్తెనపల్లి, ఆగస్టు 29 : జీవన శైలిలో వస్తున్న మార్పుల కారణంగా గుండె పోటుకు గురై మృత్యువాతకు గురై మృతి చెందుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. వయస్సుతో సంబంధం లేకుండా ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలో గుండె పోటుకు గురైన వారిని నిర్దేశిత సమయంలో ఆస్పత్రికి తీసుకువెళితే కాపాడే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని, ఇందుకు గాను కూటమి ప్రభుత్వం 'హృదయ రక్ష' పేరుతో ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. ఈ విషయంపై గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గుండెపోటు మరణాలు తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. స్థానికంగా ఉండే వైద్యుల సూచనల మేరకు ఏరియా వైద్యశాలకు గుండెపోటుకి గురైన వారిని గోల్డెన్ అవర్‌లో తీసుకు వస్తే బహిరంగ మార్కెట్‌లో రూ.42వేలు విలువ చేసే ఇంజక్షన్‌ను ఉచితంగా చేసి ప్రాణాపాయం నుంచి కాపాడేందుకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాల వైద్యులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ విధంగా ఇప్పటి వరకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో 23 మంది గుండె పోటు బాధితులను ప్రాణాప్రాయం నుంచి కాపాడినట్లు తెలిపారు. 10ఎక్స్+ ఇంజక్షన్ గుండె పోటు బాధితులకు ఏరియా వైద్యశాలలో అందుబాటులో ఉంచామన్నారు. గుండె పోటు మరణాలను వీలైనంత వరకు తగ్గించటానికి ప్రభుత్వం హృదయ రక్ష పథకాన్ని అమలు చేస్తుందని ఆయన తెలిపారు.

వేతనాల పెంపుపై హర్షం

రాజుపాలెం, ఆగస్టు 29: దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం కింద రూ.25వేలు అందజేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించటం హర్షణీయమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని ఇనిమెట్ల గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తూచ తప్పకుండా అమలు చేస్తోందన్నారు. నాయీ బ్రాహ్మణుల వేతలనాల చెల్లింపు విషయంలో గత ప్రభుత్వం రూ.20 వేలకు అనేక ఆంక్షలు పెట్టి అందజేస్తే, నేడు కూటమి ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.25 వేలు అందజేస్తుండటం సంతోషదయకమన్నారు. కార్యక్రమం లో కూరపాటి రఘురామయ్య, తుపాకుల పెద్దకేశవులు, బ్రహ్మయ్య అమరేశ్వ రరావు, వెంకాయమ్మ, నరసింహారావు, దత్తు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: దేవాలయాల్లో పని చేస్తున్న నాయి బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25వేలకు పెంచుతూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవటం పట్ల నాయి బ్రాహ్మణులు, త్యాగరాజా మందిర కమిటీ సభ్యులు గురువారం హర్షం వ్యక్తంచేస్తూ చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పిలుట్ల సుబ్బారావు, పత్తిపాటి హరికృష్ణ, కే.కమేశ్వరావు, శ్రీని వాసరావు, చంద్రగిరి కేటేశ్వరరావు, పిలుట్ల ఆంజనేయులు, పలువురు నాయి బ్రాహ్మణ సంఘ నేతలు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

● తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాల్లో వక్తలు

మాచర్ల రూరల్, ఆగస్టు 29: తెలుగు భాషను కనుమరుగై పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండలంలోని కొప్పునూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఐవీ నాగమణి తెలిపారు. గురువారం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు దాసరి పెదయాసప్‌ను దుశ్శాలువలతో సత్కరించారు. అలాగే జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫిట్‌ఇండియా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అప్పారావు, శ్రీనివాసరావు, మధుబాబు,పాల్గొన్నారు.

మాచర్లటౌన్: ప్రాథమిక పాఠశాల వరకు విద్యాబోధన తెలుగులో ఉండాలని డాక్టర్ కమలహాసన్‌రావు అన్నారు. స్థానిక కృష్ణవేణి జూనియర్ కళాశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ, సంస్కృత అధ్యాపకుడు కోడెల పూర్ణచంద్రరావు, ఎస్‌వీఆర్ డిగ్రీకళాశాల తెలుగుఅధ్యాపకుడు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఎంఈవో రవికుమార్, హెచ్‌ఎం పుల్లమ్మ పాల్గొన్నారు.

దాచేపల్లి: తెలుగు భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ సెల్ నేత కరాలపాటి జాని గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు వ్యవహారిక భాషో ద్యమ ఉన్నతికి గిడుగు చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో మాదాసు ఆదినారాయణ, నల్లగుంతల శ్రీను, కొప్పుల శ్రీరాములు, దైద శ్రీను పాల్గొన్నారు.



పెదకూరపాడులో ప్రజా కవి దర్శి శేషారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

క్రోసూరు: స్థానిక జడ్పీ హైస్కూల్లో గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు శ్రీహరిప్రసాదు, హరిబాబు, లీలలను సత్కరించారు. విద్యార్థులకు పద్యాలు, పాటలు, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ 119వ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను సత్కరించారు. కార్యక్రమలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్చంపేట: స్థానిక జడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించినట్టు పాఠశాల పీడీ ఆలపాటి సుజాత తెలిపారు. ఎంఈవో ఏకుల ప్రసాదరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పాఠశాల పూర్వ విద్యార్థి జాతీయస్థాయి క్రీడాకారుడైన పోలిశెట్టి నరేంద్రను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు జీ అనీల్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జునరావు, బద్దు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: స్థానిక జడ్పీ హైస్కూల్లో గురువారం ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని, గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, మాజీ మండల అధ్యక్షుడు గాల్లా బాబూరావు ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాకాని వెంకటరమణ, తెలుగు ఉపాధ్యాయుడు రాంబాబులు తెలుగు భాష గొప్పతనం గురించి వివరించారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం బాబూరావు, రాంబాబు, దర్శి శేషారావులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ నాగరాజు, రాధాకృష్ణ, సాంబశివరావులు పాల్గొన్నారు.

మండలంలోని 75 తాళ్ళూరు, గారపాడు జడ్పీ హైస్కూళ్లలో తెలుగు బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 30 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



రజనీకాంత్ చిత్రంలో నాగార్జున

రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'కూలీ' చిత్రంలో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. ఇందులో ఆయన పోషిస్తున్న సైమన్ పాత్రను పరిచయం చేస్తూ యూనిట్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్న మరో చిత్రం 'కుబేర' నుంచి ఆయన స్టైలిష్ లుక్‌ను విడుదల చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మగవాళ్లనూ వదల్లేదు

• దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై తాజా ఆరోపణ

మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక పరిశ్రమను కుదిపేస్తోంది. తాజాగా మరి కొందరు మలయాళ సినీ ప్రముఖులపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. నటి మిను మునీర్ ఆరోపణలతో బుధవారం నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముఖేశ్, హీరో జయసూర్యపై అత్యాచారం కేసు నమోదు చేశారు. వీరితో పాటు మరో ఐదుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఇప్పటివరకూ 17 మందిపై కేసులు నమోదయ్యాయి.

అవకాశం ఇస్తానని...

మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ తనను లైంగికంగా వేధించాడని బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే అతను ఆడవాళ్లనే కాదు మగవాళ్లనూ వదల్లేదు అని కోజికోడ్‌కు చెందిన నజీర్ అనే వ్యక్తి సంచలన ఆరోపణలు చేశాడు. తనపైన 2012లో రంజిత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు నజీర్ కేరళ డీజీపీకి ఫిర్యాదు చేశాడు. "సినిమా అవకాశం ఇస్తానని చెప్పి బెంగళూరులోని తాజ్ హోటల్‌కు అర్ధరాత్రి పిలిపించుకున్నాడు. గదిలోకి వెళ్లాక నా దుస్తులు తొలగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నా ఫొటోలు తీశాడు. 'వాటిని ఎవరికి పంపావు' అని అడిగితే 'లోపలి గదిలో నటి రేవతి ఉన్నారని రంజిత్ నాతో చెప్పాడు. అయితే ఆమె నిజంగా అక్కడ ఉన్నారా? లేదా, వారిద్దరి మధ్య ఎలాంటి సంబంధం ఉందనేది నాకు తెలియదు' అని నజీర్ చెప్పాడు.

పృథ్వీరాజ్ తగిన వ్యక్తి

అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు నిర్వహించేందుకు హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ తగిన వ్యక్తి అని నటి మిను మునీర్, పార్వతి తిరువోతు అభిప్రాయపడ్డారు. అమ్మ ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ మూకుమ్మడి రాజీనామాపై నటి పార్వతి తిరువోతు స్పందించారు. అసోసియేషన్‌లో నిరంకుశ పాలన నడుస్తోందని ఆరోపించారు. మీడియా ముందుకొచ్చి మాట్లాడే అవకాశం లేకపోవడంతోనే రాజీనామా చేశామన్నారు. తమ నిర్ణయం పిరికితనంగా అనిపించిందనన్నారు. ఇంతమంది మహిళలు ధైర్యంగా బయటకొచ్చి ఫిర్యాదు చేస్తున్నా కేరళ ప్రభుత్వం విచారణలో నిర్లక్ష్యం చూపుతోందని మిను ఆరోపించారు.

కోలీవుడ్‌లోనూ కమిటీ

'అడ్జెస్ట్‌మెంట్' పేరుతో సినిమా అవకాశాలు ఇస్తామని గాలం వేసేవారు ఎంతటివారైనా చెప్పుతో కొట్టాలని 'నడిగర్ సంఘం' ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ పిలుపునిచ్చారు. జస్టిస్ హేమ కమిషన్ తరహాలోనే కోలీవుడ్‌లోనూ నడిగర్ సంఘం ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం అని చెప్పారు.



హేమ కమిటీకి సమంత ప్రశంసలు

మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికితేవడంలో హేమ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని టాలీవుడ్ కథానాయిక సమంత ప్రశంసించారు. అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కారణమైన డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) సంస్థనూ ఆమె అభినందించారు. ఆ సంస్థ సభ్యుల కష్టం వల్లే ఈ రోజు మహిళల సమస్యలు చర్చనీయాంశంగా మారాయని చెప్పారు. సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ కోసం ఆ సంస్థ అవిశ్రాంతంగా పాటుపడుతోందని అభినందించారు. 'డబ్ల్యూసీసీ గురించి నాకు చాలా కాలంగా తెలుసు. ప్రభుత్వం హేమ కమిటీ ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ తీసుకొన్న చొరవే కారణం. వారి పోరాటానికి నా కృతజ్ఞతలు' అన్నారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6tDC2Mxలో చదవండి.

నవరస నటనకు యాభై ఏళ్లు!

ఎన్టీఆర్ వంటి మహా నటుడికి వారసుడు కావడం ఒక విధంగా బాలకృష్ణ అదృష్టం, మరో రకంగా అగ్నిపరీక్ష కూడా. తండ్రి పేరు నిలబెట్టే ఆ విషయంలో విజయం సాధించారు బాలకృష్ణ. యాభై ఏళ్లక్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైన 'తాతమ్మ కల'(1974 ఆగస్టు 30) చిత్రంతో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. సాధారణంగా 30 ఏళ్లో, నలభై ఏళ్ల కాలమో కథానాయకుడిగా నటించి, ఆ తర్వాత క్యారెక్టర్ పాత్రలకు షిఫ్ట్ అయిన నటులు ఎందరో! కానీ బాలకృష్ణ విషయం చాలా ప్రత్యేకం. తొలి సినిమా 'తాతమ్మ కల' నుంచి ఇప్పటి వరకూ ఒక్క ఏడాది కూడా గ్యాప్ తీసుకోకుండా హీరోగానే నటిస్తూ యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించారు బాలకృష్ణ. సెప్టెంబర్ ఒకటిన దక్షిణాది చిత్ర పరిశ్రమలోని అతిరథ మహారథుల సమక్షంలో ఆయనకు భారీ సన్మానం జరుగుతున్న నేపథ్యంలో ఆయన కెరీర్‌లో మలుపులు, మెరుపులు....

ప్రపంచ వ్యాప్తంగా ఎందరో నటీనటులు తమ వారసుల్ని వెండితెరకు పరిచయం చేశారు. ఆ సంప్రదాయాన్ని మన దేశంలో మహానటుడు పృథ్వీరాజ్ కపూర్ అనుసరించారు. ఆయన తనయులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ తండ్రి లాగానే నటనను వృత్తిగా స్వీకరించి తమదైన బాణీ పలికించారు. రాజ్ కపూర్ కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకొని తన ముగ్గురు కొడుకుల్ని హీరోలుగా పరిచయం చేశారు. దక్షిణాది మహా నటుడు నందమూరి తారకరామారావు ఈ విషయంలో రాజ్ కపూర్‌ను అనుసరిస్తూ తొలిసారిగా తెలుగు నాట తన తనయులు హరికృష్ణ, బాలకృష్ణను నటనా రంగంలో అడుగు పెట్టేలా ప్రోత్సహించారు. అయితే నట వారసుల్లో ఎవరికీ లేనంత సుదీర్ఘమైన కెరీర్ బాలకృష్ణ సొంతం.

- బాలకృష్ణ నటించిన తొలి చిత్రం 'తాతమ్మ కల'కు కూడా కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కుటుంబ నియంత్రణ విధానాన్ని దేశంలో తొలిసారిగా ప్రవేశ పెట్టినప్పుడు ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ నిర్మించిన సినిమా ఇది. యాభై రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న తర్వాత సినిమాను ఆపేసి, చిన్న చిన్న మార్పులతో మళ్లీ విడుదల చేశారు. రెండు సార్లు సెన్సార్ అయి, రెండు సార్లు విడుదల అయిన సినిమా తెలుగులో ఇదొక్కటే. ఇందులో బాలకృష్ణది బాలనటుడి పాత్ర కాదు. కథలో కీలకమైన పాత్ర.
- ఎన్టీఆర్ అనితర సాధ్యంగా అభినయించిన శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను బాలకృష్ణ సైతం పోషించి అభిమానుల్ని అలరించారు. అంతే కాదు ఎన్టీఆర్ పోషించని అభిమన్యు, నారద, ఆంజనేయ పాత్రలను బాలకృష్ణ పోషించి అభినందనలు అందుకున్నారు. పెద్దాయన పాతాళ భైరవి వంటి జానపద చిత్రాల్లో నటిస్తే, బాలయ్య భైరవ ద్వీపం సినిమాతో అభిమానులను ఆకట్టుకున్నారు.
- ఒకే చిత్రంలో అటు భగవంతుడు, ఇటు భక్తునిగా నటించిన ఘనత తెలుగు నాట ఎన్టీఆర్, బాలకృష్ణ దే. 1964లో వచ్చిన 'శ్రీ సత్యనారాయణ మహత్యం' లో ఎన్టీఆర్ శ్రీ మహా విష్ణువుగా, సత్యవ్రతుడిగా నటించారు. అలాగే 'పాండురంగడు' లో బాలయ్య శ్రీకృష్ణ, పుండరీక పాత్రలతో మెప్పించారు.
- బాలకృష్ణ ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో కాలేదు. ఆయన నటిస్తేనే అది ట్రెండ్ అయింది. ఆ ట్రెండ్‌ను తర్వాత మిగిలిన హీరోలందరూ ఫాలో కావడం గమనార్హం. డిస్కో డ్యాన్సులు, మెషిన్‌గన్స్‌తో యాక్షన్ సినిమాలు వస్తున్న రోజుల్లో బాలకృష్ణ పంచె కట్టుతో, కర్ర సాముతో బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించారు. ఆ తర్వాత చాలా కాలం తెలుగులో గ్రామీణ వాతావరణంలో సినిమాలు వచ్చాయి. అలాగే తెలుగులో ఫ్యాక్షన్ సినిమాల నిర్మాణం బాగా పెరగడానికి బాలకృష్ణ నటించిన 'సమరసింహా రెడ్డి', 'నరసింహనాయుడు' చిత్రాల సంచలన విజయమే కారణం.
- ఎన్టీఆర్ తన 52 వ ఏట బాపు దర్శకత్వంలో రూపొందిన శ్రీరామాంజనేయ యుద్ధం చిత్రంలో శ్రీరామునిగా నటించారు. అలాగే బాలకృష్ణ కూడా తన 52 వ ఏటనే అదే బాపు దర్శకత్వంలో శ్రీరామరాజ్యం చిత్రంలో శ్రీరామునిగా నటించడం విశేషం.
- తండ్రి పేరుతో తీసిన బయోపిక్ లో తనయుడు హీరోగా నటించిన సందర్భాలు గతంలో లేవు. అరుదైన ఆ ఘనత బాలయ్య కే దక్కింది. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు, మహనాయకుడు చిత్రాల్లో బాలయ్య ఎన్టీఆర్ గా కనిపించడంతో అభిమానులు మురిసిపోయారు.
- రాజకీయ నాయకునిగా కూడా తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారు బాలకృష్ణ. మూడు సార్లు హిందూపరం శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ ప్రజా సేవలోనూ తన ముద్రను చాటారు.



ఇప్పటివరకూ రాని సినిమా



హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలీ 'రాజ రాజ చోర' చిత్రం తర్వాత కలసి చేస్తున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో రాజు, భవభూతి, సింగ, యయాతి పాత్రలను శ్రీవిష్ణు, రాణి రుక్మిణీదేవి పాత్రలో రీతూ వర్మ నటించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ ' మన అందరి ఇళ్లలో ఉన్న పాయింటే అయినా ఇండియన్ స్ర్కీన్ మీద ఇప్పటివరకూ రాని సినిమా ఇది. ఇలాంటి సినిమా తీయడానికి ముందుకు వచ్చిన విశ్వప్రసాద్ గారికి కృతజ్ఞతలు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అన్నారు. 'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి ఇంతకుముందు 'రాజ రాజ చోర' సినిమా చేశాం. 'శ్వాగ్' చాలా విభిన్న చిత్రం' అని తెలిపారు విశ్వప్రసాద్. దర్శకుడు హసిత్ గోలీ మాట్లాడుతూ 'ఇది అచ్చ తెలుగు సినిమా. కంటెంట్ చాలా మాట్లాడుతుంది. తాత, ముత్తాతలతో కలసి చూడగలిగే సినిమా. విష్ణు బాగా చేశారు. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అన్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ తదితరులు నటించారు.

ఐదు భాషల్లో 'కుంభ'



స్వీయ దర్శకత్వంలో వి.సముద్ర నిర్మించే 'కుంభ' చిత్రం గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. హీరో విజయ్‌రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత డీఎస్ రావు తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు చంద్రమహేశ్, దేవిప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. 'కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో ఐదు సినిమాలు తీస్తున్నాను. వాటిల్లో 'కుంభ' ఒకటి. ఐదు భాషల్లో ఈ సినిమా తయారవుతుంది' అని సముద్ర చెప్పారు. విజయ్‌రామ్ హీరోగా, సూరజ్ ఆదిత్య విలన్‌గా నటిస్తున్నారు.



కొత్తగా...

తెలుగు భాషా దినోత్సవం రోజున...

ఎప్పటినుంచో తెలుగు భాష, సంస్కృతి, విలువల గురించి సినిమా తీయాలనే కోరిక ఉంది. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలు ఉన్న అంశాలు కలిగిన కథ దొరికినప్పుడే అలాంటి సినిమా చేయాలి. ఇప్పుడు అటువంటి కథ కుదిరింది. 1980 నేపథ్యంలో జరిగే సినిమా ఇది. తెలుగు భాషా దినోత్సవం రోజున ఈ సినిమా వివరాలు ప్రకటించడం ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు వైవీఎస్ చౌదరి. సీనియర్ ఎన్టీఆర్ముని మనవడు నందమూరి తారక రామారావు హీరోగా, వీణా రావు హీరోయిన్‌గా నటించనున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా చౌదరి ఆయనకు నివాళులు అర్పించారు. చిత్ర ఎగ్జిక్యూటివ్ నిర్మాత రమేశ్ అత్తిలిని చౌదరి ఈ సందర్భంగా పరిచయం చేశారు. 'మేం నలుగురం స్నేహితులం కలసి చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాలని అనుకున్నాం. చౌదరిగారితో కలసి ఈ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది' అన్నారు రమేశ్ అత్తిలి. ఈ కార్యక్రమంలో నిర్మాత యలమంచిలి గీత, మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సొంతింటి నిర్మాణానికి రూ.4 లక్షలు సాయం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, ఆగస్టు 29: స్థలం ఉండి ఇంటి నిర్మాణం కోసం చూస్తున్న వారికి ప్రభుత్వం రూ.4లక్షల సాయం అందిస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని గణపవరం పరిధిలోని శివ ప్రియనగర్ ప్లాట్ల యజమానుల సంఘం కోరిక మేరకు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శివప్రియనగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం శివప్రియ నగర్ వెంచర్ వేసి 650 మందికి ప్లాట్లు అమ్మారన్నారు. ఎవరి ప్లాట్ ఎక్కడ ఉందో కూడా తెలియదన్నారు. లబ్ధిదారులు ఎక్కడ ఉన్నా రిజిస్ట్రేషన్ పత్రాలతో వస్తే స్వాధీనం చేయటానికి శివ ప్రియ నగర్ కమిటీ సిద్ధంగా ఉందన్నారు. 40ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ నగర్ అభివృద్ధి చెందితే మరో పట్టణంగా తీర్చిదిద్దే అవకాశం కలుగుతుందన్నారు. తెల్ల కార్డులు ఎవరైనా కలిగి ఉంటే వారికి రూ.4 లక్షలు చొప్పున ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శివప్రియ నగర్‌లో రహదారులు, డ్రెయినేజ్, నీటి సౌకర్యాలను కల్పిస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు సీనియర్ టీడీపీ నేత షేక్ కరిముల్లా, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, జనసేన నేత తోట రాజారమేష్, పేలూరి రామారావు ఉన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన


విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్

చిలకలూరిపేట, ఆగస్టు 29: గత రెండు రోజులుగా రంగారెడ్డి జిల్లా కొత్తూరులో జరిగిన సౌత్ జోన్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీలలో స్థానిక ఎస్‌కేకేఎస్ సీవీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ చూపి పలు పతకాలు సాధించారు. కోకో పోటీలలో అమృత రోజా, వాలీబాల్ పోటీలలో హర్ష గోల్డ్ మెడల్స్ సాధించారు. క్రికెట్ పోటీలలో కే శ్రీనివాస నాయక్ వెండి పతకం సాధించారు. ప్రతిభ చూపిన వీరిని కళాశాల పాలకవర్గం తేళ్ల సుబ్బారావు, ఎం.శివానందకుమార్, బచ్చు రామలింగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, పీడీ ఎస్.మురళీకృష్ణ అభినందించారు.

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి, ఎమ్మెల్యే అరవిందబాబు

వన మహోత్సవ ఏర్పాట్లపై పరిశీలన


ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

నరసరాపేట టౌన్, ఆగస్టు 29: నరసరావుపేట జేఎన్‌టీయూ కళాశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాక సందర్భంగా గురువారం ఏర్పాట్లను టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పరిశీలించారు. జేఎన్‌టీయూ వద్ద సభాస్థలాన్ని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు జేఎన్‌టీయూకు శంకుస్థాపన చేశారని, అదే జేఎన్‌టీయూ కళాశాలలో ఇప్పుడు వన మహోత్సవం నిర్వహించ తలపెట్టవలసి రావటం శుభ పరిణామం అన్నారు. రాబోయే తరాలు బాగుండాలంటే పెరిగిన కాలుష్యాన్ని తగ్గించి, పచ్చదనంపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. వన మహోత్సవాన్ని నరసరావుపేటలో ప్రారంభిచండ జిల్లాకు దక్కిన గౌరవం అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో కనీవినీ ఎరుగని విధంగా ఆతిథ్యం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చూసుకోవాలని సూచించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, గొట్టిపాటి జనార్ధన్‌బాబు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఆర్‌జేడీ విచారణ

● విచారణపై ఉపాధ్యాయుల అభ్యంతరాలు

● ఫిర్యాదుదారులతో కలిసి విచారించాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్


గుట్టుగా ఆర్‌జేడీ విచారణ చేపట్టిన ఎంఆర్‌సీ కార్యాలయం

వినుకొండ టౌన్, ఆగస్టు 29: వినుకొండ మండలంలో ఉపాధ్యాయుల సర్దుబాటు సక్రమంగా చేపట్టలేదని, విచారణ చేపట్టాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆర్‌జేడీ లింగేశ్వరెడ్డి గురువారం స్థానికి ఎంఆర్‌సీ కార్యాలయంలో ఉపాధ్యాయుల సర్దుబాటుపై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయ సంఘానికి సమాచారం లేకుండా విచారణ చేపట్టారని ఓ ఉపాధ్యాయ సంఘం నాయకులు చర్చించుకుంటున్నారు. విచారణ గోప్యంగా జరగాల్సిన అవసరం ఏముందని ఉపాధ్యాయులు నిలదీస్తున్నారు. ఉపాధ్యాయుల సర్ధుబాటులో ఎంఈవో జఫ్రూల్లా నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బీఈడీ లేని ఉపాధ్యాయురాలుని హైస్కూల్‌కు, హైస్కూల్‌కు అర్హత ఉన్న ఓఉపాధ్యాయుడిని ప్రాథమిక పాఠశాలకు కేటాయించారని, ఇలా కొంత మందిని సర్దుబాటు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వినుకొండతోపాటు బొల్లాపల్లి, ఈపూరులో కూడా నిబంధనలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో డీఈవోకు ఫిర్యాదుచేసిన ఉపాధ్యాయులను బెదిరించి బలవంతంగా ఎంఈవోకు అనుకూలంగా లెటర్లు రాయించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉపాధ్యాయుల సర్దుబాటు చేసిన ఎంఈవోపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరుతున్నారు.

ఈ విషయంపై ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డిని వివరణ కోరగా ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఏపీటీఎఫ్ గతంలో విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారని, ఫిర్యాదు మేరకు నేడు వినుకొండలో విచారణ చేపట్టామని ఆర్‌జేడీ తెలిపారు. విచారణ పూర్తి నివేదికను కమిషనర్‌కు అందచేస్తామని తెలిపారు. ఫిర్యాదుచేసిన ఏపీటీఎఫ్ సంఘం నాయకులను పిలవలేదని చెబుతున్నారని అడగా విచారణకు వారే దూరంగా ఉన్నారని వెల్లడించారు.



పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు, 29. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో క్రీడాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ గడియార స్తంభం నుంచి ప్రారంభమై స్టేడియం వరకు సాగింది. ర్యాలీలో పలువురు క్రీడాకారులు, విద్యార్థులు, శిక్షకులు ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ ఎస్ఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం


దాసరి శ్రీనివాసరావు

చిలకలూరిపేట, ఆగస్టు 29: చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్ కొత్త ఎస్ఐగా దాసరి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నరసరావుపేట డీటీసీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. చిలకలూరిపేట అర్బన్ స్టేషన్‌కు మొత్తం నలుగురు ఎస్ఐలు అవసరం కాగా ప్రస్తుతం శ్రీనివాసరావుతో కలిపి ఇద్దరు ఎస్ఐలు మాత్రమే ఉన్నారు. మరో ఇద్దరు బదిలీపై ఇక్కడికి రావలసి ఉన్నది. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావును కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

యోగాసన పోటీలకు ఎన్ఈసీ విద్యార్థిని ఎంపిక

నరసరావుపేట రూరల్, ఆగస్టు 29: స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగంలో నాల్గో సంవత్సరం చదువుతున్న డి.నాగాంజలి సౌత్‌జోన్ యోగాసన పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి రాజమండ్రిలో యోగాసన భారత్ అసోసియేషన్ నిర్వహించిన 18 సంవత్సరాల పైబడిన మహిళల కేటగిరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం తిరుచునాపల్లిలో నిర్వహించనున్న మహిళా యోగాసన పోటీలలో డి.నాగాంజలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని డి.నాగాంజలిని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎం.చక్రవర్తి, కళాశాల సెక్రటరీ ఎం.రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, ఈఈఈ విభాగాధిపతి షేక్ షరీఫ్, ఏవో ఐ.శ్రీధర్, వ్యాయామ అధ్యాపకులు ఎల్.కృష్ణారెడ్డి, ఎస్. ఆంజనేయులు, పి.విజయ్‌కుమార్ అభినందించారు.

రేపు ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

నరసరావుపేట రూరల్, ఆగస్టు 29: మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ పనులు నిర్వహణపై ఈ నెల 31వ తేదీన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బహిరంగ ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందని ఏపీవో ప్రదీప్‌కుమార్ తెలిపారు. గ్రామస్థాయిలో సోషల్ ఆడిట్ నిర్వహణ పూర్తయిన నేపథ్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీకు సంబంధించిన ప్రజావేదిక జరగనుంది. ఈ ప్రజావేదికలో ఉపాధిహామీ పథకం, గృహనిర్మాణ శాఖ, పశు సంవర్ధక శాఖ, అటవీశాఖ, సర్వశిక్షా అభియాన్, సామాజిక భద్రతా పింఛను, పంచాయతీరాజ్ శాఖ తదితర శాఖల సామాజిక తనిఖీ కార్యక్రమాలపై ప్రజా వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మహంకాళి ఆలయ పునఃనిర్మాణం కోసం విరాళం

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), ఆగస్టు 29: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ పునఃనిర్మాణం కోసం నరసరావుపేటకు చెందిన దప్పిలి వెంగళరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు రామోహనరెడ్డి ధర్మపత్ని శ్రీలక్ష్మీ దంపతులు రూ.50,058 విరాళంను ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దాతలు రామోహనరెడ్డి ధర్మపత్ని శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దాతలకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతం

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహంకాళి అమ్మవారి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి తెలిపారు. సామూహిక వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమంలో పాల్గొనే వారికి పూజా సామాగ్రి దేవస్థానం తరఫున ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.


కలెక్టర్ నుంచి అవార్డును అందుకొంటున్న హెచ్ఎం, పీడీ

శావల్యాపురం జడ్పీ పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు

శావల్యాపురం, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 2024-25 విద్యాసంవత్సరానికి గాను శావల్యాపురం జడ్పీ పాఠశాలను ప్రభుత్వం క్రీడాప్రతిభ అవార్డుకు ఎంపిక చేసింది. నర్సరావుపేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా శావల్యాపురం జడ్పీ పాఠశాల హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిలు పాల్గొని క్రీడాప్రతిభ అవార్డును అందుకున్నారు. హెచ్ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ గతేడాది పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో బాగా రాణించి చాలా సర్టిఫికెట్లు సాధించారని, పాఠశాలకు వచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగా శావల్యాపురం జడ్పీ పాఠశాల 75పాయింట్లు సాధించి జిల్లాలో ఐదోస్థానంలో నిలిచిందన్నారు. దీంతో ప్రభుత్వం క్రీడాప్రతిభ అవార్డుకు ఎంపిక చేసిందని తెలిపారు. అవార్డును సాధించడంలో కీలకపాత్ర పోషించిన బాలబాలికలు, పీడీ రాధాకృష్ణమూర్తిలను పీఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, హెచ్ఎం విజయలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయుడు బీవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, సుబాష్‌చంద్రారెడ్డి, భువనేశ్వరి, నిర్మల, శ్రీకాంత్ తదితరులు అభినందించారు.

పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు

శావల్యాపురం, ఆగస్టు 29: మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం 15వ ఆర్థికసంఘం నిధులు రూ.31,01,527లను విడుదల చేయనునట్లు ఈవోపీఆర్డీ పొట్టేపాలెం సుగుణ గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలవారీగా బొందిలిపాలెం రూ.1,00,727, చిన్నకంచెర్ల రూ.1,20,535, గుంటుపాలెం రూ.1,12,644, ఇర్లపాడు రూ.90,507, కనమర్లపూడి రూ.1,94,988, కారుమంచి రూ.3,66,777, కొత్తలూరు రూ.1,69,464, మతుకుమల్లి రూ.2,67,110, ముండ్రువారిపాలెం రూ.1,30,070, పిచికలపాలెం రూ.1,19,663, పొట్లూరు రూ.2,96,476, శానంపూడి రూ.1,34,583, శావల్యాపురం రూ.2,93,415, వయ్యకల్లు రూ.1,21,853, వేల్పూరు రూ.5,82,715లను త్వరలో విడుదల చేయనునట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు ఇటీవల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను తయారుచేసి ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయడం జరిగిందని, పంచాయతీ కార్యదర్శులు నమోదుచేసిన పనులకు ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థికసంఘం నిధులను వినియోగించాల్సి ఉందన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులతో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలోని ప్రజలకు అన్ని మౌలిక వసతులను కల్పించాలన్నారు.

పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం


తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా మోడరన్ స్టెల్లార్ స్కూలు విద్యార్థుల వేషధారణలు

చిలకలూరిపేట, ఆగస్టు 29: చిలకలూరిపేట ప్రాంతంలోని పలు పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పసుమర్రులోని జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో తెలుగుభాష ఔన్నత్యం గురించి, క్రీడల ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వికాస్ విట్ స్కూలులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం కల్పన, డైరెక్టర్ రోజా బహుమతి ప్రదానం చేశారు. స్కూలు డైరెక్టర్ దండా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వేదా స్కూలులో జరిగిన కార్యక్రమంలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. స్కూలు డైరెక్టర్ శ్రీగిరి పెర్సిస్వరూప తదితరులు పాల్గొన్నారు. మోడరన్ స్టెల్లార్ స్కూలులో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఆవరణ మొత్తం తెలుగు అక్షరాలతో, తెలుగు కవుల వివరాలతో అందంగా అలంకరించారు. అనంతరం తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ చేబ్రోలు మహేష్, ప్రిన్సిపాల్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె సుధ పాల్గొన్నారు.


ఈపూరులోని గ్రంథాలయంలో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రావిపాడు సెయింట్ మేరీస్‌లో...

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29: రావిపాడు సెయింట్ మేరీస్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, కల్యాణ్ రామదాస్ దుర్యోధనుడి పాత్రలో అభినయం, బొమ్మిశెట్టి పూజిత హరిశ్చంద్ర కాటి సీను పద్యంతో అలరించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎం.సుందరబాబు, ప్రిన్సిపాల్ ఎంఏ భాస్కరబాబు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.


రావిపాడులో తెలుగుభాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఈపూరు శాఖా గ్రంథాలయంలో...

ఈపూరు, ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవంను మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈపూరు శాఖా గ్రంథాలయంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని జరుపుకునే తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈపూరు హైస్కూల్‌లో హెచ్ఎం రామకృష్ణారెడ్డి పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో...

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29: స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాటలు, తెలుగు ఉపన్యాసంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవభూషణ్‌రావు, డిప్లమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు పల్నాడు స్విమ్మర్లు


పోటీలకు ఎంపికైన స్విమ్మర్లతో అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు, 29. పల్నాడుకు చెందిన స్విమ్మర్లు ఎస్.జగదీష్ వర్మ, ఎస్.మానస్ కుమార్‌లు 77వ జాతీయ చాంపియన్‌షిప్-2024 పోటీలకు ఎంపికైనట్లు పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలోని అంతర్జాతీయ స్విమ్మింగ్ కాంప్లెక్స్‌లో సెప్టెంబరు 10 నుంచి 13 వరకు జరిగే పోటీలలో, కేరళలోని తిరువనంతపురంలో సెప్టెంబరు 18 నుంచి 22 వరకు జరిగే పోటీలలో వీరిద్దరు పాల్గొంటారని చెప్పారు. కాగా వీరిద్దరు ఈ నెల 25న పట్టణంలోని ఎస్.ఎస్.ఎన్. కళాశాలలో జరిగిన 10వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభను చూపి పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ జి.సురేష్‌ను, స్విమ్మర్లను అసోసియేషన్ అభినందనలు తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో జాతీయ క్రీడా దినోత్సవం

నరరావుపేట టౌన్, ఆగస్టు 29: స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద, రెండు వందలు, 400, 800 మీటర్ల పరుగుపందాలు, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావలిన్, డిస్కస్‌త్రో నిర్వహించి విజేతలకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, కోచ్ మహమ్మద్, మక్కెన తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగారావుపాలెం మాజీ సర్పంచ్ నల్లపనేని మృతి

పలువురి ఘన నివాళి


గంగయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

లింగారావుపాలెం (యడ్లపాడు), ఆగస్టు 29: యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు నల్లపనేని గంగయ్య(86) బుధవారం సాయంత్రం మృతిచెందాడు. గంగయ్య 1987నుంచి 1995 వరకు ఎనిమిదేళ్ళపాటు గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహించి గ్రామాభివృద్ధికి పాటుపడ్డాడు. ఈయన హయాంలోనే గ్రామంలో ఉన్నత పాఠశాల నిర్మాణం జరిగింది. గంగయ్య మృతికి పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, వైసీపీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు గంగయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియచేశారు.

పంటకోత ప్రయోగాలతో బీమా పథకం వర్తింపు

మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామారావు

శావల్యాపురం, ఆగస్టు 29: రెవెన్యూ, వ్యవసాయాధికారులు సంయుక్తంగా నిర్వహించే పంట కోత ప్రయోగాల్లో వచ్చిన దిగుబడులు ఆధారంగానే ప్రభుత్వం రైతులకు పంటల బీమా పథకాన్ని వర్తింపజేస్తుందని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామినేని రామారావు అన్నారు. శావల్యాపురంలోని రైతు సేవాకేంద్రంలో వీఆర్వోలు, వీఏఏలకు పంటకోత ప్రయోగాలు, ఈ-పంట నమోదుపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంఏవో రామారావు మాట్లాడుతూ వీఆర్వోలు, వీఏఏలు కలసి పొలాలకు వెళ్ళి రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి పారదర్శకంగా ఈ-పంటలో నమోదు చేయాలన్నారు. ఈ-పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, రైతుభరోసా, సున్నా వడ్డీ, పంటల బీమా తదితర పథకాలను అర్హులైన రైతులకు అందిస్తుందన్నారు.

స్టాటికల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చే ర్యాండమ్ సర్వే నెంబర్‌లలో రైతులు ఏ పంటనైతే సాగుచేస్తారో దానిపై పంటకోత ప్రయోగాలు నిర్వహించడం జరుగుతుందని, పంట కోత ప్రయోగాలలో దిగుబడులు తగ్గితే ప్రభుత్వం రైతులకు ఇన్సూరెన్స్ పథకాన్ని వర్తింపజేస్తుందన్నారు. కాబట్టి ఈ-పంట నమోదు, పంటకోత ప్రయోగాలపై వీఆర్వోలు, వీఏఏలు అవగాహన పెంచుకోవాలని, సెప్టెంబరు 15వ తేదీలోపు ఈ-పంట నమోదు నూరుశాతం పూర్తిచేయాలన్నారు. ఏఎస్‌వో చెన్నయ్య ఏఈవో పూరేటి అశోక పాల్గొన్నారు.

● ఈపూరు: పంటల దిగుబడి, ఆహార ఉత్పత్తుల గురించి అంచనా వేసేందుకు పంటకోత ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడతాయని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ఆర్.రామారావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో కలిసి పంటకోత ప్రయోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతులందరూ ముందుగా ఈ పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. పంటకోత ప్రయోగాలను అందరూ క్రమంతప్పకుండా ఖచ్చితంగా నిర్దేశించిన సర్వే నంబర్లలో క్రమ పద్ధతిలో నిర్వహించాలని ఏఎస్‌వో కే నాగశ్రీను సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు నళిని, వ్యవసాయ విస్తరణాధికారి బండి అప్పారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామాల్లో సర్వే

రొంపిచర్ల, ఆగస్టు 29: మండలంలోని రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి రేవతి పర్యవేక్షించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వరుసగా జ్వరంతో బాధపడుతుంటే సమీపంలోని గ్రామీణ వైద్య కేంద్రాలను, పీహెచ్‌సీలను సంప్రదించాలని కోరారు. సర్వేలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

ఈపూరు, ఆగస్టు 29: మండలంలోని సత్యనారాయణపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగలూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గాయపడ్డాడు. వినుకొండ నుంచి అంగలూరు స్కూల్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్న టీచర్ మహమ్మద్ అలీని ఎదురుగా అతివేగంగా మోటార్ బైక్‌పై వస్తున్న యువకులు ఢీకొట్టారు. క్షతగాత్రుడిని వినుకొండ ఆసుపత్రికి తరలించారు.

నరసరావుపేట నియోజకవర్గ కాపునాడు సేవా సమితి కన్వీనర్‌గా జక్కా

నరసరావుపేట టౌన్, ఆగస్టు 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి నరసరావుపేట నియోజకవర్గ కన్వీనర్‌గా జక్కా వెంకటేశ్వర్లును నియమించామని జాతీయ అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా జక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియామకానికి సహకరించిన కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కాపుల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

వారం రోజులుగా నిలిచిన ఏపీ ఫైబర్‌నెట్ సర్వీస్‌లు

ఈపూరు, ఆగస్టు 29: మండలంలో ఏపీ ఫైబర్‌నెట్ సర్వీసులు గత వారం రోజులుగా నిలిచిపోయాయి. వినియోగదారులు ఆపరేటర్లను అడిగినప్పటికి వాళ్ళు ఏమి చేయలేని పరిస్థితి. సర్వీస్‌లు ఆగిన సంగతి ఏపీ ఎస్ఎఫ్ఎల్ నిర్వాహకులకు ఆపరేటర్లు విన్నవించుకున్నప్పటి ఉపయోగంలేదంటున్నారు. ఏపీఎస్ఎఫ్ఎల్‌లో పనిచేసే సిబ్బందికి జీతాలు రాకపోవడంతో వాళ్ళు పనులు చేయడం మానేశారని ఆపరేటర్లు చెబుతున్నారు. వినియోగదారులు 12మాసాల ప్యాకేజ్‌ని ఒకేసారి చెల్లిస్తున్నామని, అయినా ఇలా అంతరాయాలు కల్గించటం సరిగా లేదన్నారు. త్వరగా సర్వీసులను పునరుద్ధరించాలని పలువురు డిమాండ్‌చేశారు.

రేపటికి కౌన్సిల్ సమావేశపు తేదీ మార్పు

చిలకలూరిపేట, ఆగస్టు 29: చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తేదీలో మార్పు జరిగిందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని గురువారం తెలిపారు. నిర్ణీత షెడ్యూలు ప్రకారం ఈ నెల 30వ తేదీన కౌన్సిల్ సాధారణ సమావేశం జరగవలసి ఉంది. అయితే ఆ తేదీ నాడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన నరసరావుపేటలో ఉన్నందువలన సమావేశపు తేదీని ఈ నెల 31కు మార్చినట్లు ఆయన ప్రకటించారు.

విప్పర్లలో శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు


విప్పర్లలో ఊరేగిస్తున్న శ్రీకృష్ణుడి విగ్రహం

రొంపిచర్ల, ఆగస్టు 29: మండలంలోని విప్పర్లలో శ్రీకృష్ణుని ఊరేగింపు కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఈ నెల 26వ తేదీన గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పుర వీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

1న ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం

వినుకొండ, ఆగస్టు 29: రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 1వ తేదీన స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. రక్తదానం చేసేవారు ముందుగా 8341770883 నంబర్‌ను సంప్రదించాలన్నారు.


ఉత్పత్తిదారులకు బోనస్ అందజేస్తున్న సంగం డెయిరీ మేనేజర్ ప్రసాదు

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

కొండ్రముట్ల (ఈపూరు) ఆగస్టు 29: మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో గురువారం సాయంత్రం సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. పాలసేకరణ కేంద్రంలో 152 మంది ఉత్పత్తిదారులకు రూ.10.50 లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన సంగం డెయిరీ జనరల్ మేనేజర్ కే ప్రసాదు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల కోసం బీమా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ జీ ఆంజనేయులు, పాలసేకరణ కేంద్రం అధ్యక్షుడు ముండ్రు రామకృష్ణ, కార్యదర్శి శేషగిరి, సూపర్‌వైజర్ రామకృష్ణ, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

గతంలో జరిగిన రీసర్వేను రద్దుచేయాలి

● బోయసంక్షేమ సంఘం అధ్యక్షుడు నరసింహారావు

యడ్లపాడు, ఆగస్టు 29: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీసర్వే అంతా తప్పులతడక అని వెంటనే దానిని రద్దు చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా బోయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దగ్గు నరసింహారావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ యడ్లపాడు మండలంలోని 8 గ్రామాలలో 278 సర్వే నంబర్లలోని 2,500ఎకరాలను అప్పటి జమీందారు రాజా మానూరి వెంకటహనుమంతరావు ఇవ్వడం జరిగిందన్నారు. కాలక్రమంలో రెవెన్యూ అధికారులు రికార్డులు మార్చి అగ్రవర్ణాల పేరుతో రికార్డులు తయారు చేశారు. ఇనాం భూములను 900 సబ్ డివిన్లుగా విడగొట్టి పట్టా భూములుగా మార్చి వేశారన్నారు. సబ్‌డివిజన్‌లు చేసి ఎవరిపేరుతో అయితే నమోదు చేశారో వారంతా ఆక్రమణదారులే కాని నిజమైన యజమానులు కాదని ఆరోపించారు. రీసర్వే 2022కి ముందు ఆ భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎవరిపేర్లు లేవన్నారు. అంతేగాకుండా బోయసంక్షేమ సంఘం తరఫున ఇనాం భూముల మీద విచారణ కమిషన్ వేయవలసిందిగా హైకోర్టులో కేసు కూడా వేయడం జరిగిందన్నారు. కేసు కోర్టులో ఉండగానే సదరు భూములను రీసర్వే చేయడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇచ్చారన్నారు. అలా చేయడం చట్టవిరుద్ధమని, తప్పుల తడక అయిన రీసర్వేను రద్దుచేసి తమకు న్యాయం చేయవలసిందిగా సీసీఎల్ఏ ప్రధాన కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.